క్లుప్తంగా

నూతన వధూవరులకు ఆశీర్వాదం



నూతన వధూవరులతో మేరిగ మురళీధర్

కోట: మండలంలోని జరుగుమల్లికి చెందిన వైఎస్సార్ సీపీ నేత కర్లపూడి బుజ్జయ్య మనవరాలు రోస్‌లీనా, రాజేంద్ర వివాహం బుధవారం కోట షాదీమంజిల్‌లో జరిగింది. వారిని ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్ ఆశీర్వదించారు. పార్టీ మండల కన్వీనర్ పలగాటి సంపత్‌కుమార్‌రెడ్డి, సన్నారెడ్డి చెంచురాఘవరెడ్డి, పాముల సురేంద్ర, నరమాల రమణయ్య, కస్తూరయ్య పాల్గొన్నారు.

రైతుల సాధికారత కోసమే..

చిల్లకూరు : తీరప్రాంత గ్రామాల్లోని రైతులు సాధికారత సాధించేందుకు తగిన తోడ్పాటు అందిస్తున్నట్టు అదానీ క్రిష్ణపట్నం పోర్టు సీఎస్సార్ విభాగం ప్రతినిధులు తెలిపారు. వారు బుధవారం గుమ్మళ్లదిబ్బ గ్రామంలో వేరుశనగ విక్రయాలపై అవగాహన కల్పించారు. వారు మాట్లాడుతూ క్రిష్ణపట్నం పోర్టు పార్మర్ ప్రొడ్యూసర్ కంపెనీ లిమిటెడ్, న్యూట్రిక్రాఫ్ ఎంటర్ ప్రైజర్స్ ప్రయివేట్ లిమిటెడ్ ప్రతినిధులు సంయుక్తంగా వేరుశనగ పప్పును ప్యాకింగ్ చేసి సూపర్, గ్రామీణ మార్కెట్లలో విక్రయించేలా చూస్తున్నట్టు తెలిపారు. ఇందుకు గాను నెలకు సుమారు పది వేల కేజీల వేరుశనగ పప్పును గ్రేడింగ్ చేసి ప్యాకెట్లు తయారుచేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో అదానీ ఫౌండేషన్ హెడ్ రాజేష్ రంజన్, డైరెక్టర్ కోటేశ్వరమ్మ, జగదీష్‌పటేల్ తదితరులు పాల్గొన్నారు.

ఆధార్ సెంటర్లకు పోటెత్తిన గిరిజనులు



చిల్లకూరు : మండలంలోని ఐదు గ్రామాల్లో గిరిజనుల కోసం ఏర్పాటుచేసిన ఆధార్ సెంటర్లకు ప్రజలు పోటెత్తుతున్నారు. వీఆర్వోలు తహసీల్దార్ గుర్తింపుతో గిరిజనులకు ఆధార్ కార్డులు మంజూరు చేసేలా చర్యలు తీసుకున్నారు. కడివేడు సచివాలయంలోని ఆధార్ కేంద్రానికి సుమారు 400 మంది వరకు వచ్చారు. అంత మందికి ఆధార్ కార్డులు లేకపోవడంపై అధికారులు ఆశ్చర్యం వ్యక్తం చేశారు. సర్వర్ సక్రమంగా పనిచేయకపోవడంతో కొంత ఇబ్బంది పడాల్సి వచ్చింది. కార్యక్రమాన్ని స్థానిక వీఆర్వో శ్రీనివాసులు పర్యవేక్షించారు.

కండలేరు గెస్ట్ హౌస్‌లో షార్ట్ సర్క్యూట్

రాపూరు: కండలేరు అతిథి గృహంలోని స్టోర్ రూమ్‌లో బుధవారం షార్ట్ సర్క్యూట్‌తో అగ్ని ప్రమాదం సంభవించింది. విద్యుత్ సామగ్రి, సీసీ ఫుటేజీ, పలు రికార్డులు కాలిపోయినట్టు అధికారులు తెలిపారు. మధ్యాహ్నం 2 గంటల సమయంలో ఒక్కసారిగా మంటలు వ్యాపించినట్టు సిబ్బంది తెలిపారు. మంటలను ఆర్పేందుకు ప్రయత్నించినా ఫలితం లేకపోవడంతో అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇచ్చారు. వారు అక్కడికి చేరుకుని మంటలను అదుపుచేశారు. కాలిపోయిన పరికరాల వల్ల ఎంత నష్టం వాటిల్లిందో అంచనా వేయాల్సి ఉందని కండలేరు డీఈ రేవతి తెలిపారు.

గుండెపోటుతో లారీ డ్రైవర్ మృతి

దొరవారిసత్రం : మండలంలోని టపాయిండ్లు గ్రామం వద్ద మంగళవారం రాత్రి గుండెపోటు రావడంతో పార్శల్ లారీ డ్రైవర్ ఎస్.ధనశేఖర్(41) మృతిచెందాడు. పోలీసుల కథనం మేరకు.. తమిళనాడు తిరుత్తూరు జిల్లా పాలవాకం గ్రామానికి చెందిన ధనశేఖర్ లారీ డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. అతను మంగళవారం లారీలో పార్శల్ తీసుకుని నెల్లూరు నుంచి తడ ప్రాంతంలోని శ్రీసిటీలోని ఒక కంపెనీకి బయలుదేరాడు. దొరవారిసత్రం మండలం టపాయిండ్లు వద్దకు రాగానే అతనికి ఉన్నట్టుండి గుండెపోటు వచ్చింది. అపస్మారక స్థితిలోకి చేరుకున్నాడు. లారీ అదుపుతప్పి రోడ్డు మధ్యలోని డివైడర్‌ను ఢీకొని ఆగిపోయింది. గమనించిన వాహనదారులు టోల్‌ప్లాజా అంబులెన్స్‌కి సమాచారం అందించారు. వారు అక్కడికి చేరుకుని సూళ్లూరుపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందాడు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కక్షసాధింపులో భాగంగానే కాకాణి అరెస్టు



శ్రీనివాసులు రెడ్డి

చిట్టమూరు: కూటమి ప్రభుత్వ కక్ష సాధింపు చర్యల్లో భాగమే మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డిని అరెస్ట్ అని వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు సన్నారెడ్డి శ్రీనివాసులు రెడ్డి ఆరోపించారు. ఆయన బుధవారం చిట్టమూరులో విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రంలో రెడ్ బుక్ పాలన సాగుతోందన్నారు. ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తున్న వారిపై తప్పుడు కేసులు పెట్టి అరెస్ట్ చేస్తున్నారని దుయ్యబట్టారు. కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా ప్రజలను తప్పుదోవ పట్టించేందుకు డైవర్షన్ పాలిటిక్స్ చేస్తోందని విమర్శించారు. రాష్ట్ర ప్రజలు గమనిస్తున్నారని, తగిన సమయంలో బుద్ధి చెబుతారని పేర్కొన్నారు.

కండలేరులో 41.177 టీఎంసీల నీరు

రాపూరు: కండలేరు జలాశయంలో బుధవారం నాటికి 41.177 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు ఈఈ విజయకుమార్‌రెడ్డి తెలిపారు. కండలేరు నుంచి సత్యసాయి గంగ కాలువకు 1,890, పిన్నేరు కాలువకు 20, లోలెవల్ కాలువకు 60, హైలెవల్ కాలువకు 20, మొదటి బ్రాంచ్ కాలువకు 85 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు తెలిపారు.

నాడు: సిబ్బందితో కళకళలాడుతున్న గ్రామ సచివాలయం



నేడు: సిబ్బంది లేక వెలవెలబోతున్న సచివాలయం



ఆధునిక వసతులతో నిర్మించిన ఓజిలి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం



అంతా నయవంచనే

గడిచిన ఐదేళ్లలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం సచివాలయాలు, వలంటీర్ల ద్వారా ప్రజలకు ఇంటి వద్దే అన్ని సేవలూ అందించింది. పలు సంక్షేమ పథకాలు అమలు చేసి పేదల జీవన ప్రమాణాన్ని పెంచింది. కరోనా వంటి విపత్కర పరిస్థితుల్లోనూ సంక్షేమ పథకాలను నిరాటంకంగా కొనసాగించింది. నేడు కూటమి ప్రభుత్వం ప్రజలను అన్ని విధాలుగా ఇబ్బందులకు గురిచేస్తోంది. సేవల కోసం మళ్లీ ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరిగేలా చూస్తోంది. అర్హులందరికీ పథకాలు కాకుండా కూటమి నేతలు, కార్యకర్తలకే అన్నీ దోచి పెడుతోంది. దీంతో ప్రజలు కన్నీరుపెడుతున్నారు. మంచి చేసిన జగనన్నను కాదని, చంద్రబాబును నమ్మినందుకు తగిన గుణపాఠం చెప్పారని వాపోతున్నారు.

- నాడు అర్హులందరికీ సంక్షేమ పథకాలు
- నేడు కూటమి కార్యకర్తలకే అన్నీ
- కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు
- కన్నీరు పెడుతున్న పల్లె జనం

సూళ్లూరుపేట : గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం గడప గడపకూ ప్రభుత్వ సేవలు అందించేందుకు చర్యలు తీసుకుంది. ఇందులో భాగంగా సచివాలయాలు, వలంటీర్ల వ్యవస్థలను ఏర్పాటు చేసింది. ప్రతి రెండు వేల మంది జనాభాకు ఒక సచివాలయం, ప్రతి 50 ఇళ్లకు ఒక వలంటీర్‌ను ఏర్పాటు చేసి గ్రామ స్వరాజ్యాన్ని తీసుకొచ్చింది. సచివాలయాల్లో 545 రకాల సేవలను ప్రజలకు అందించి తహసీల్దార్, ఎంపీడీవో తదితర కార్యాలయాలకు వెళ్లే పనిలేకుండా చేసింది. ప్రతి నెలా ఒకటో తేదీ తెల్లవారుజామునే లబ్ధిదారులను నిద్ర లేపి పింఛను అందించింది. రేషన్ షాపుల్లో క్యూలో నిలబడకుండా ఇంటి వద్దే రేషన్ సరుకులను సరఫరా చేసింది. ఫ్యామిలీ డాక్టర్ పథకం కింద డాక్టర్లు, వైద్య సిబ్బంది గ్రామాలకు వచ్చి వైద్య సేవలు అందించారు. ప్రతి సచివాలయంలోనూ విలేజ్ క్లినిక్‌లను ఏర్పాటు చేసి వైద్యం అందించారు. రైతు భరోసా కేంద్రాల ద్వారా రైతులకు విత్తనాలు, ఎరువులు, వ్యవసాయ పరికరాలు ఇచ్చింది. పంటల సాగులో మెళకువలను అందించింది. ఉచిత పంటల బీమాను ఐదేళ్లు కొనసాగించింది. నాడు–నేడు కింద ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్ దీటుగా అభివృద్ధి చేసింది. గూడూరు సబ్ డివిజన్ పరిధిలోని సూళ్లూరుపేట, గూడూరు, వెంకటగిరి నియోజకవర్గాల్లో సుమారు రూ.3 వేల కోట్లతో అభివృద్ధి పనులు చేశారు. నియోజకవర్గానికి రూ.2 కోట్లను డీబీటీ, నాన్ డీబీటీ కింద ప్రజలకు నేరుగా అందజేశారు.

తొలి సంతకంతోనే మోసం..

ప్రమాణ స్వీకారం రోజే తొలి సంతకం సూపర్ సిక్స్ పథకాలపై పెడతానని చెప్పిన చంద్రబాబు మొదటి రోజే మాట తప్పారు. పింఛన్ల పెంపుతోనే సరిపెట్టారు. ఉచిత బస్సు ప్రయాణమని, మహిళలకు నెలకు రూ.1500 ఇస్తానని మొండి చేయి చూపారు. ఆడబిడ్డ నిధికి సున్నం వేశారు. ఫీజు రీయింబర్స్‌మెంట్‌కు ఎగనామం పెట్టారు. ఏడాదికి 20 వేల ఉద్యోగాలు ఇస్తానని, లేకుంటే నిరుద్యోగ భృతి ఇస్తానని చెప్పి నిరుద్యోగులను నిలువునా ముంచారు. ఇలా అన్ని వర్గాల ప్రజలను నయవంచన చేశారు.



నాడు–నేడు పథకంలో కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా మన్నారుపోలూరు జిల్లా పరిషత్ హైస్కూల్

కూటమి ప్రభుత్వ పాలనలో సంక్షేమ పథకాలకు పాతర

సూపర్ సిక్స్ అంటూ ఎన్నికల్లో ప్రజలను నమ్మించి ఓట్లేయించుకుని అధికారంలోకి వచ్చిన ముఖ్యమంత్రి చంద్రబాబు సంక్షేమ పథకాలకు పాతరేశారు. అదిగోఇదిగో అంటూ చెవిలో పూలు పెడుతూ అన్ని వర్గాల ప్రజలను నయ వంచన చేస్తున్నారు. రూ.10 వేల జీతమని చెప్పి నేడు వలంటీర్ వ్యవస్థనే రద్దు చేశారు. ఇంటింటికీ రేషన్ పథకాన్ని రద్దు చేశారు. రేషన్ షాపుల వద్ద క్యూలో నిలబడి సరుకులు తీసుకొచ్చే పరిస్థితికి తీసుకొచ్చారు. విలేజ్ హెల్త్ క్లినిక్‌లను నిర్వీ ర్యం చేశారు. సచివాలయాల సిబ్బందితో వివిధ సర్వేలు చేయిస్తూ ప్రజలకు అందుబాటులో లేకుండా చేసింది. అక్కడ సేవలు పూర్తిగా ఆగిపోయాయి. రైతు భరోసా కేంద్రాలను నిరుపయోగంగా మార్చేశారు. రైతుకు పెట్టుబడి సాయం కింద రూ.20 వేలు ఇస్తామన్న మాట బూటకమైంది.

గతంలో ఇంటి వద్దే అన్నీ అందాయి



జగనన్న ప్రభుత్వం గ్రామ వలంటీర్ల ద్వారా ఇంటి వద్దకే అన్ని పంపించింది. మా అమ్మ తుపాకుల రాజమ్మ చనిపోయి రెండు నెలలు కావస్తోంది. మరణ ధ్రువీకరణ పత్రం కోసం తిప్పలు పడుతున్నాం. వలంటీర్లు ఉండి ఉంటే ఇంటి వద్దకే పత్రం తీసుకువచ్చి ఇచ్చేవారు. ఇప్పుడు కార్యాలయాల చుట్టూ తిరగాల్సి వస్తోంది.

- తుపాకుల రఘు, కృష్ణాపురం ఎస్టీ కాలనీ, దొరవారిసత్రం

రైతులను పట్టించుకోవడం లేదు



కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది అయినా రైతులకు పెట్టుబడి సాయం అందించలేదు. ఎరువులు, విత్తనాల ఊసే లేదు. గతంలో వలంటీర్ల ద్వారా సమస్యలు పరిష్కారం అయ్యేవి. ఇప్పుడు కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి నెలకొంది. పంటల బీమా లేదు. పంటలకు నష్టపరిహారమూ లేదు.

- కె.రామ్మూర్తిరాజు, చిలమానుచేను, ఓజిలి

పేదలకు వైద్యం అందడం లేదు



గత ప్రభుత్వంలో ఫ్యామిలీ డాక్టర్ పేరుతో వైద్యులు ఇంటి వద్దకే వచ్చి సేవలు అందించేవారు. ఇప్పుడు ఆస్పత్రులకు వెళ్లినా వైద్యం అందడం లేదు. ఇప్పుడు ప్రైవేట్ ఆస్పత్రులకు వెళ్లాల్సి వస్తోంది. ఆరోగ్యశ్రీ కింద బిల్లులు రావడం లేదని ప్రైవేట్ ఆస్పత్రుల్లో ఆపరేషన్లు చేయడం లేదు.

- తిరకాల విజయ, ఊటుకూరు, సైదాపురం

తల్లికి వందనం ఏదీ..?



అమ్మ ఒడి కింద గత ప్రభుత్వం ప్రతి ఏటా రూ.15 వేలు ఇచ్చింది. వాటితో పుస్తకాలతోపాటు పిల్లలకు అన్నీ కొనుక్కునేవాళ్లం. కూటమి ప్రభుత్వం తల్లికి వందనం అంటూ పంగనామం పెట్టింది. ఇప్పుడు బడులు తెరిచిన వెంటనే పిల్లలను బడికి ఎలా పంపాలనే విషయం ఆలోచన చేయాల్సి వస్తుంది.

- శారదమ్మ, వాకాడు మండలం

కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నాం



జగన్ పాలనలో ప్రభుత్వ పథకాలన్నీ ఇంటి వద్దకే వచ్చేవి. ఇప్పుడు ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నాం. అప్పుడు ఇంటి వద్దే రేషన్ సరుకులు ఇచ్చేవారు. వారం వారం డాక్టర్, నర్సులు ఇంటి వద్దకు వచ్చి పరీక్షలు చేసి మందులు ఇచ్చేవారు. చంద్రబాబు వచ్చిన తర్వాత అవేవీ జరగడం లేదు.

- వెంకటేశ్వర్లు, చెంబేడు గిరిజన కాలనీ, పెళ్లకూరు

మహిళలను మోసం చేస్తున్నారు



జగనన్న నాకు ప్రతి ఏటా ఉచితంగా రూ.10 వేలు ఇచ్చారు. నా కుమార్తెకు అమ్మ ఒడి వచ్చింది. లాండ్రి షాపునకు జగనన్న తోడు కింద బ్యాంకు నుంచి రూ.10 వేలు రుణం వచ్చింది. అన్ని సర్టిఫికెట్లు వలంటీర్లు ఇంటి వద్దకే తెచ్చి ఇచ్చేవారు. చంద్రబాబు ఏవేవో ఇస్తామని చెప్పి మహిళలను మోసం చేశారు.

- పుల్లూరు మనోరమ, నాయుడుపేట

జగనన్న నాకు ఇల్లు ఇచ్చారు



జగనన్న నాకు పక్కా ఇల్లు మంజూరు చేశారు. ప్రభుత్వం ఇచ్చిన సొమ్ముతోపాటు కొంత సొంతంగా ఖర్చు చేసి ఇల్లు నిర్మించుకున్నాం. అందులో ఉంటున్నాం. గతంలో ఇంటి కోసం నాయకులు, అధికారుల చుట్టూ తిరిగినా ఫలితం లేదు. అద్దె లు కట్టలేక ఇబ్బంది పడేవాళ్లం. ఇప్పుడు సంతోషంగా ఉంది.

- తాళ్లపాక సుబ్బమ్మ, జగనన్న కాలనీ, గూడూరు

తాగునీరు వల్లే కిడ్నీ వ్యాధులు



వైద్య సిబ్బందితో మాట్లాడుతున్న జిల్లా వైద్యాధికారి

చిల్లకూరు : గూడూరు మున్సిపాలిటీలోని పోటుపాళెం గ్రామంలో తాగునీటి సమస్య వల్లే ప్రజలు కిడ్నీ వ్యాధి బారిన పడుతున్నారని జిల్లా వైద్యాధికారి బాలక్రిష్ణ నాయక్ తెలిపారు. ఆయన బుధవారం పోటుపాళెం గ్రామంలో కిడ్నీ వ్యాధిగ్రస్తులతో మాట్లాడి వైద్య సేవలు, పింఛను తదితర సమస్యలపై ఆరా తీశారు. కిడ్నీ వ్యాధిగ్రస్తురాలు గుంటపూడి లక్ష్మమ్మ మాట్లాడుతూ నాలుగేళ్లుగా కిడ్నీ వ్యాధితో బాధపడుతున్నానని, నెల్లూరులోని అపోలో ఆస్పత్రిలో డయాలసిస్ చేయించుకుంటున్నట్టు తెలిపారు,. ఇందుకు వారు రూ.2 వేల ఫీజు తీసుకుంటున్నట్టు తెలిపారు. గతేడాది వరకు రూ.10 వేల పింఛను వచ్చేదని, ఇప్పుడు వితంతు పింఛను రూ.4 వేలు ఇస్తున్నారని తెలిపారు. ఆయన ఈ విషయాన్ని జిల్లా కోఆర్డినేటర్ దృష్టికి తీసుకెళ్లి పింఛను వచ్చేలా చూస్తామని హామీ ఇచ్చారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ పోటుపాళెం గ్రామంలో గత 10 ఏళ్లలో సుమారు 24 మంది కిడ్నీవ్యాధి బారిన పడినట్టు తెలిపారు. 20 మందికి నయమైందని, నలుగురు డయాలసిస్ చేయించుకుంటున్నారని అన్నారు. మరో 50 మందికి పరీక్షలు చేయగా ఒకరికి పాజిటివ్ వచ్చినట్టు తెలిపారు. ఇక్కడ తాగునీటిలో లోపం ఉన్నందునే కిడ్నీ వ్యాధిబారిన పడుతున్నారని తెలిపారు. ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళతామన్నారు. కార్యక్రమంలో చెన్నూరు, చింతవరం పీహెచ్‌సీల వైద్యులు జ్యోతి, పాల్ జాన్సన్, చెన్నూరు పీహెచ్‌సీ సూపర్‌వైజర్లు, వైద్య సిబ్బంది, పాల్గొన్నారు.

ఆస్పత్రి సిబ్బందిపై డీఎం అండ్ హెచ్‌వో ఆగ్రహం

వాకాడు : ప్రభుత్వ ఆస్పత్రిలో రోగులకు అందిస్తున్న వైద్య సేవలు, మందుల వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయకపోవడంపై డీఎం అండ్ హెచ్‌వో బాలకృష్ణ నాయక్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆయన బుధవారం వాకాడు మండలం నిడిగుర్తి పీహెచ్‌సీని తనిఖీ చేశారు. వైద్య సేవలు, మందుల వివరాలను ఆన్‌లైన్ ఎందుకు చేయలేదని మండిపడ్డారు. సిబ్బంది మాట్లాడుతూ ఇక్కడ నెట్‌వర్క్ సరిగా పనిచేయకపోవడంతో ఆన్‌లైన్‌లో నమోదు చేయలేకపోతున్నామన్నారు. త్వరలోనే మరో డాక్టర్‌ను నియమిస్తామని తెలిపారు. ఆయన వెంట డిప్యూటీ డీఎంఅండ్ హెచ్‌వో మస్తానమ్మ, వైద్యులు శశికుమార్, సిబ్బంది ఉన్నారు.

జగన్‌ను కలిసిన నేదురుమల్లి



వెంకటగిరి(సైదాపురం) : వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని బుధవారం తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. వెంకటగిరి నియోజకవర్గంలో పార్టీ బలోపేతంపై చర్చించారు. అలాగే ప్రస్తుతం రాజకీయ పరిస్థితులను వివరించారు.

మాజీ మంత్రి పెద్దిరెడ్డిని కలిసిన వెంకటరెడ్డి



పెద్దిరెడ్డికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న వెంకటరెడ్డి

ఓజిలి: మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిని బుధవారం తిరుపతిలోని ఆయన నివాసంలో ఓజిలి మండలం భట్లకనుపూరుకు చెందిన వైఎస్సార్ సీపీ సీనియర్ నేత గుడ్ల వెంకటరెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. మండలంలోని రాజకీయ విషయాలను ఆయన దృష్టి తీసుకెళ్లారు. కూటమి ప్రభుత్వం వేధింపులకు భయపడవద్దని, వైఎస్సార్ సీపీ అండగా ఉంటుందని మాజీ మంత్రి ఆయనకు భరోసా ఇచ్చారు. పార్టీ కోసం కష్టపడిన వారికి రానున్న రోజుల్లో సముచిత స్థానం ఇస్తామని పెద్దిరెడ్డి హామీ ఇచ్చారని వెంకటరెడ్డి తెలిపారు.

భూపరిహారం చెల్లించేలా చర్యలు



భూసమస్యలపై సిబ్బందితో మాట్లాడుతున్న జేసీ శుభంబన్సల్

పెళ్లకూరు: నాయుడుపేట–పూతలపట్టు జాతీయ రహదారి రోడ్డు విస్తరణలో భూములు, ఇళ్లు కోల్పోయిన వారికి పరిహారం చెలించేలా చర్యలు తీసుకున్నామని జేసీ శుభంబన్సల్ పేర్కొన్నారు. ఆయన బుధవారం పెళ్లకూరు రెవెన్యూ కార్యాలయాన్ని తనిఖీ చేశారు. భూసమస్యలపై రికార్డులను పరిశీలించారు. చాలా కాలంగా పరిహారం కోసం ఎదురు చూస్తున్న వంకపూరి రమణమూర్తి, రాజారత్నయ్య, దశరథయ్య, ఆంటోని, తిరుపతయ్య తదితరులకు పరిహారం చెల్లించేందుకు చర్యలు చేపట్టాలని రెవెన్యూ అధికారులను ఆదేశించారు. అలాగే పెన్నేపల్లి సమీపంలో హైవోల్టేజ్ విద్యుత్ లైన్ సమస్యను పరిష్కరించాలన్నారు. ఆయన వెంట తహసీల్దార్ ద్వారకానాథ్‌రెడ్డి, వివిధ ప్రాంతాల వీఆర్వోలు ఉన్నారు.

సచివాలయం అద్దాలు ధ్వంసంపై ఫిర్యాదు

ఓజిలి: మండలంలోని మాచవరం సచివాలయం అద్దాలను ధ్వంసం చేసిన యువకుడు దారా ప్రభాస్‌పై పంచాయతీ కార్యదర్శి మస్తానయ్య బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. అతను సచివాలయంలోకి అక్రమంగా ప్రవేశించి అద్దాలు విరగొట్టాడని, అతనిపై చర్యలు తీసుకోవాలని కోరారు.

ఆత్మహత్యకు యత్నించిన వ్యక్తి మృతి

సైదాపురం: గడ్డి మందు తాగి ఆత్మహత్యకు యత్నించిన వ్యక్తి చికిత్స పొందుతూ బుధవారం మృతిచెందినట్టు ఎస్‌ఐ క్రాంతికుమార్ తెలిపారు. ఆయన కథనం మేరకు.. సైదాపురం మండలం కట్టుబడిపల్లికి చెందిన గిలక రవి(38) సొంత వదినతో ఐదేళ్లుగా సహజీవనం చేస్తున్నాడు. కొంతకాలంగా ఆమె ప్రవర్తనపై అనుమానం పెంచుకున్నాడు. ఈ క్రమంలో ఈ నెల 9వ తేదీన గడ్డి మందు తాగి ఆత్మహత్యకు యత్నించాడు. గమనించిన కుటుంబ సభ్యులు అతన్ని నెల్లూరు ఆస్పత్రికి తరలించారు. అక్కడ పరిస్థితి విషమించి బుధవారం మృతిచెందాడు. కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ క్రాంతికుమార్ తెలిపారు.


పరామర్శ



మధుసూదన్‌రెడ్డిని పరామర్శిస్తున్న మేరిగ మురళీధర్

కోట: కొక్కుపాడుకు చెందిన వైఎస్సార్ సీపీ నాయకుడు యరటపల్లి మధుసూదన్‌రెడ్డి సోదరుడు నిరంజన్‌రెడ్డి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్ బుధవారం కొక్కుపాడులోని ఆయన నివాసానికి చేరుకుని నిరంజన్‌రెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. మధుసూదన్‌రెడ్డి, వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయన వెంట పార్టీ మండల కన్వీనర్ పలగాటి సంపత్‌కుమార్‌రెడ్డి, సన్నారెడ్డి చెంచురాఘవరెడ్డి, శశిధర్‌రెడ్డి ఉన్నారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం



డక్కిలిలో యోగాసనాలు వేస్తున్న సిబ్బంది

డక్కిలి/రాపూరు : యోగాతో సంపూర్ణ ఆరోగ్యం కలుగుతుందని డక్కిలి ఎస్‌ఐ శివశంకర్, రాపూరు ఎంపీడీవో భవాని తెలిపారు. డక్కిలిలోని ఏపీ అంబేడ్కర్ గురుకుల పాఠశాల, కళాశాల, రాపూరు ఎంపీడీవో కార్యాలయంలో బుధవారం సచివాలయ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు, పొదుపు సంఘాల సభ్యులకు యోగాపై అవగాహన కల్పించారు. యోగాసనాలు వేయించారు. ప్రతి ఒక్కరూ యోగా చేయడం వల్ల అనేక ప్రయోజనాలు ఉంటాయని వివరించారు. కార్యక్రమంలో డక్కిలి పంచాయతీ కార్యదర్శి వెంకటాద్రి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

అంగన్‌వాడీల్లో నాసిరకం సరుకులు



అంగన్‌వాడీ కార్యకర్తతో మాట్లాడుతున్న ఆరి శంకరయ్య

వెంకటగిరి రూరల్ : వెంకటగిరి ఐసీడీఎస్ క్లస్టర్ పరిధిలో ఉన్న అంగన్‌వాడీ సెంటర్లలో నాణ్యతలేని పౌష్టికాహారం పంపిణీ చేస్తున్నట్లు 14వ వార్డు కౌన్సిలర్, వైఎస్సార్ సీపీ ఆర్టీఐ విభాగం నియోజకవర్గ అధ్యక్షుడు ఆరి శంకరయ్య ఆరోపించారు. ఆయన బుధవారం ఐసీడీఎస్ కార్యాలయం, పోలీసు క్వార్టర్, ధర్మాపురం, బందెలదొడ్డి వీధిలోని అంగన్‌వాడీ కేంద్రాలను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ పిల్లలు, బాలింతలకు ఇచ్చే పౌష్టికాహారం నాణ్యత గురించి కార్యకర్తలను ప్రశ్నిస్తే ప్రభుత్వం సరఫరా చేసినవే తాము అందజేస్తున్నట్టు సమాధానం ఇస్తున్నారని తెలిపారు. సీడీపీవోను వివరణ తీసుకునేందుకు మూడు రోజుల నుంచి ప్రయత్నిస్తున్నా అందుబాటులోకి రావడం లేదన్నారు. జిల్లా ఉన్నతాధికారులు దృష్టి సారించి తగిన చర్యలు తీసుకోవాలని కోరారు.

ప్రశ్నించే గొంతులను నొక్కేందుకే అరెస్టులు



పలగాటి సంపత్ కుమార్‌రెడ్డి

కోట: కూటమి ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలను ప్రశ్నిస్తున్నందుకే మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డిని అరెస్ట్ చేసి జైలుకు పంపారని వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ పలగాటి సంపత్‌కుమార్‌రెడ్డి తెలిపారు. ఆయన బుధవారం కోటలో విలేకరులతో మాట్లాడారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చలేక ప్రజలను తప్పుదారి పట్టించేందుకు వైఎస్సార్ సీపీ నాయకులపై తప్పుడు కేసులు పెట్టి జైలుకు పంపుతోందని తెలిపారు. ఎన్ని కేసులు పెట్టినా భయపడేది లేదని, కలిసికట్టుగా ఎదుర్కొంటామని పేర్కొన్నారు.

రేషన్ షాపుల్లోనే సరుకులు పంపిణీ చేయాలి

వాకాడు : ప్రభుత్వ ఆదేశాల మేరకు జూన్ 1వ తేదీ నుంచి నిత్యావసర సరుకులను రేషన్ షాపుల్లోనే పంపిణీ చేయాలని, ఉల్లంఘించిన వారిపై చర్యలు తప్పవని తహసీల్దార్ రామయ్య హెచ్చరించారు. ఆయన బుధవారం మండలంలోని రేషన్ డీలర్లతో సమావేశమయ్యారు. ఇక నుంచి ప్రభుత్వం నిర్దేశించిన ప్రకారం ప్రతి నెలా 1 నుంచి 15 తేదీ వరకు ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, అలాగే సాయంత్రం 4 నుంచి 8 గంటల వరకు రేషన్ షాపులు తెరిచి ఉంచాలన్నారు. 65 ఏళ్లు నిండిన వృద్ధులు, దివ్యాంగులకు ఇంటి వద్దకే వెళ్లి రేషన్ పంపిణీ చేయాలన్నారు.

నేటి నుంచి వికసిత కృషి సంకల్ప అభియాన్

వెంకటగిరి రూరల్ : రైతులు ఖరీఫ్‌లో అధిక ఆదాయం పొందేలా గురువారం నుంచి వికసిత కృషి సంకల్ప అభియాన్ నిర్వహించనున్నట్లు కృషి విజ్ఞాన కేంద్రం సీనియర్ శాస్త్రవేత్త డి శ్రీనివాసులు రెడ్డి తెలిపారు. ఆయన బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. వెంకటగిరిలోని కృషి విజ్ఞాన కేంద్రంలో వెంకటగిరి, డక్కిలి, బాలాయపల్లి మండలాలకు చెందిన రైతులకు పంటల సాగులో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, వ్యవసాయంలో సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకోవడం తదితరాలపై అవగాహన కల్పిస్తామని తెలిపారు.